# నేటి నుంచి పారిశుధ్యంపై ప్రత్యేక కార్యాచరణ

## వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 12 : గత రెండున్నర నెలలు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించలేకపోయామని, ఇప్పుడు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీవోలు, ఏపీవోలు, ఏపీఎంలతో నర్సరీల నిర్వహణ, పారిశుధ్యం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. నేటి నుంచి వారం రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి గ్రామాల్లో పారిశుధ్య పనులు, రోడ్ల పైన, రోడ్లకు ఇరువైపులా చెత్తాచెదారం తొలగించాలని ఆదేశించారు. అన్ని మండలాలలో ఎంపీడీవో లు, ఎంపీవోలు, మున్సిపల్ వార్డులలో మున్సిపల్ కమిషనర్లు పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. అన్ని ఆవాసాలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తాగు నీటిని సరఫరా చేయాలని, వీధి దీపాలు వెలిగే విధంగా పూర్తి బాధ్యతతో పనులు చేపట్టాలని సూచించారు. హరితహారంలో భాగంగా నిర్వహిస్తున్న నర్సరీలన్నీ బాగుండాలని, అన్ని నర్సరీల్లో కేటాయించిన లక్ష్యానికి మూడింతలు ఎక్కువ మొత్తంలో మొక్కలు పెంచాలని తెలిపారు. హరితహారంలో ఉపయోగపడే మొక్కలను పద్ధతి ప్రకారంగా పెంచాలని సూచించారు. వర్షాకాలంలో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించేందుకు, పిచ్చి మొక్కలను తొలగించి సాసరింగ్ చేసి నీరు పోయాలని గుర్తు చేశారు. ఉపాధి హామీ కూలీలతో గడ్డి, పిచ్చి మొక్కలను 15 రోజులలో తొలగించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య ను పెంచాలని సూచించారు. వీధి వ్యాపారులకు లక్ష్యం మేరకు రుణాలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని మెప్మా అధికారిని ఆదేశించారు. ఆఫీసు సమయంలో నిర్ల క్ష్యం వహించకుండా పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని, క్షేత్రస్థాయి సిబ్బందికి అటెండెన్స్ యాప్ ను పక్కాగా అమలు చేయాలన్నారు. జిల్లా అధికారులందరూ ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పని చేయాలని, క్రింది స్థాయి సిబ్బందితో కూడా పనులు చేయించుకోవాలని సూచించారు. ప్రతిరోజూ ఎంతమంది సిబ్బంది విధులకు హాజరవుతున్నారు, ఎంతమంది గైర్హాజర్ అయినారో అటెండెన్స్ యాప్ ద్వారా సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. కాగా జిల్లాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నాలుగు నియోజకవర్గాలలో శాసనసభ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించిన అధికారులందరిని కలెక్టర్ అభినందించారు. రాబోయే గ్రామ పంచాయతీ, పార్లమెంట్, మున్సిపల్ ఎన్నికల్లో ఇదే స్ఫూర్తి తో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధులను నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, డీఆర్‌డీవో కృష్ణన్, డిప్యూటీ సీఈవో సుభాషిణి, డీపీవో తరుణ్ కుమార్, మెప్మా పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

వికారాబాద్, డిసెంబర్12 : రెవెన్యూ శాఖలో వీఆర్ఏలుగా విధులు నిర్వహించి ఇతర శాఖలకు ప్రమోషన్ పొందిన తాము నాలుగు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం కలెక్టర్ నారాయణ రెడ్డికి వీఆర్ఏలుగా పని చేసి ప్రమోషన్ పొందిన ఉద్యోగులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టి.సరోజ, అంజిలప్ప, శ్రీను, లవ కుమార్, నర్సమ్మ, శిరీష, సరిత, అంజి, కృష్ణ తదితరులు ఉన్నారు

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

ధారూరు, డిసెంబర్12: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ధారూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యానికి మద్దతు ధర ఏ గ్రేడ్ కు రూ 2,203లుగా, బీగ్రేడ్‌కు రూ. 2183గా ప్రభుత్వ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఏఈవో సంజీవ్‌రాథోడ్, సుజాత, సిబ్బంది, పీఏసీఎస్ సీఈవో నర్సింహులు, సర్పంచ్ చంద్రమౌళి, డైరెక్టర్లు సుధాకర్‌గౌడ్ శివకుమార్, అబ్బుల్ గఫార్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వహించాలి

## తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో వివిధ శాఖల అధికారులు, నాయకులు

తాండూరు, డిసెంబర్ 12: తాండూరు నియోజకవర్గంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది మంగళవారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరగకూడదన్నారు. అన్యాయం, అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. ఇందులో ఎవరూ మోసాలకు పాల్పడకూడదన్నారు. ముఖ్యంగా నియోజక వర్గంలో ఇసుక, నాపరాతి, సుద్ద రవాణాలో సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అనుమతులు లేకుండా అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు, రైతులకు ఎక్కడ కూడా ఇబ్బందులు జరగరాదన్నారు. త్వరలో ప్రజల్లో తిరిగే ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటామన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా తాండూరు అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. తన గెలుపునకు సహకరించిన అందరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

**పెద్దేముల్ మండల కేంద్రంలో..**

**పెద్దేముల్:** తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని మండల మహిళా సమాఖ్యలో వీఏవోలుగా పనిచేస్తున్న పలువురు మంగళవారం కలిసి శుకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్దేముల్ జడ్పీటీసీ ధారాసింగ్, నాయకులు మహిపాల్ రెడ్డి, లొంక నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎంసీ సమావేశాలు ప్రారంభం



బొంరాస్‌పేటలో మాడల్ లెస్సన్ బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

బొంరాస్‌పేట, డిసెంబర్ 12 : రెండు రోజులపాటు నిర్వహించే పాఠశాల సముదాయ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని ఆయా క్లస్టర్లలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. తొలిమెట్టు, ముఖ గుర్తింపు హాజరు తదితర అంశాలపై చర్చించారు. ఉపాధ్యాయులు మాడల్ లెస్సన్ బోధించారు. ఎంఈవో రాంరెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరును ప్రతిరోజూ ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. బుధవారం రెండో రోజు కూడా సమావేశాలు జరుగనున్నాయి. సమావేశాల్లో సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధాన్యం పైసలు త్వరగా జమ చేయాలి

## - డీఆర్‌డీవో పీడీ కృష్ణన్

దోమ, డిసెంబర్ 12: ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో త్వరితగతిన డబ్బులు జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీవో పీడీ కృష్ణన్ అన్నారు. మండల పరిధిలోని పాలేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు రైతుల దగ్గర నుంచి 2965 బ్యాగులను (118.60 క్వింటాళ్లు) కొనుగోలు చేసి రైస్ మిల్లులకు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. పాస్ బుక్స్ అప్‌డేట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ సుజ్ఞాని, ఐకేపీ సిబ్బంది యాదమ్మ, అనిత, సంధ్యారాణి, బుక్ కీపర్ రఘు తదితరులు పాల్గొన్నారు.



పాలేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో పీడి కృష్ణన్

# వేతన బకాయిలు చెల్లించాలని వినతి



తహసీల్దార్ కిషన్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పెద్దేముల్, డిసెంబర్ 12: వేతన బకాయిలను త్వరగా చెల్లించి ఎంప్లాయి ఐడీలను కూడా కేటాయించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తహసీల్దార్ కిషన్‌కు మంగళవారం రెవెన్యూ ఉద్యోగులు వినతిపత్రాన్ని అందించారు. వినతిపత్రం అందించిన వారిలో రమేశ్, మహేశ్, శ్రీను, భాగ్యలక్ష్మి, అనంతలక్ష్మి, హరీశ్, నజీర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# వైభవంగా కార్తిక మాస పూజలు

పరిగి, డిసెంబర్ 12: కార్తిక మాసం చివరి మంగళవారం సందర్భంగా పరిగి మండలం కాళ్లాపూర్ పరిధిలోని శ్రీ లొంక ఆంజనేయ స్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం ఉదయం నుంచే ఆంజనే యస్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో భజన కార్యక్రమాలు జరిపారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాఫర్‌పల్లికి చెందిన అనంత్‌రెడ్డి కుటుంబ సభ్యు లు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ వారు సన్మానించారు. మంగళవారం వందలాది మంది భక్తులతో ఆలయ పరిసరాలు నిండిపోయాయి.



అనంతరెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

### ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

మర్పల్లి, డిసెంబర్ 12: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని సీపీఎం జిల్లా నాయకుడు మహిపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని సిరిపురం గ్రామంలో సీపీఎం, సీఐటీయూ మండల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వాటిని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పద్మారావు, మాసయ్య, బాబు, ఆనందం, సంజీవులు, మొగులయ్య, కిష్టయ్య, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు

### విద్యావనరుల కేంద్రానికి కొత్తగా ఆరు కంప్యూటర్లు

పెద్దేముల్, డిసెంబర్ 12 : మండల విద్యావనరుల కేంద్రానికి నూతనంగా ఆరు కంప్యూటర్లు వచ్చినట్లు విద్యావనరుల కేంద్రం ఎంఐఎస్ కోఆర్డినేటర్ కృష్ణ తెలిపారు. వీటిని ఎంఆర్‌సీ కార్యాలయంలో భద్రపరిచారు.

# దివ్యాంగులకు ఆటల పోటీలు

వికారాబాద్, డిసెంబర్ 12: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా డిసెంబర్ 15న రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ ఆటల పోటీలు ప్రారంభిస్తారని తెలిపారు. పరుగు పందెం, షార్ట్ పుట్, చెస్, క్యారమ్స్, జావలిన్ త్రో తదితర పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, సమస్త దివ్యాంగులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.